
www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: **Karimnagar**, Circulated to: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**
హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 75 | మంగళవారం | 27 ఆగస్టు 2024

## కాశ్మీర్ స్టార్ కాంపెయినర్ ప్రధాని మోడీ
మొత్తం 40మందితో ప్రచార సారథుల జాబితా
2 లో..



## కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం
- పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు
- తాను వెళ్లేవరకు మరణించిన స్థితిలో డాక్టర్
- నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

2 లో..



## పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల కిరాతకం
- ప్రయాణికులపై దుండగుల కాల్పులు
- 23 మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

2 లో..



# నిరుద్యోగులకు శుభవార్త
## త్వరలోనే మరో 35వేల ఉద్యోగాల భర్తీ
- విద్యార్థుల వల్లనే తెలంగాణ పోరాటం
- నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం
- త్వరలోనే యూనివర్సిటీల్లో విసిల నియామకం
- తెలంగాణ అభివృద్ధే మా లక్ష్యం అన్న సీఎం
- సివిల్స్ అభ్యర్థులకు లక్ష సాయం కింద చెక్కుల పంపిణీ
- సచివాయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** సెక్రెటరీయేట్‌లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ సాయాన్ని అందజేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ సాయంతో ఈపథకం కింద సాయం అందించారు. గత ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో పదేళ్లు కళ్లారా చూశామని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్ సర్వెంట్లు కావాలని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే మళ్లీ ఆర్థికసాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

మిగతా 2 లో

"నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. విద్యార్థుల ఉద్యమం వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని, నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 90 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. సరైన సమయం లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రూప్-1, 2, 3 కావచ్చు.. ఇతర ఉద్యోగాలు కావచ్చు.. ఖాళీలను బర్తీ చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

## కొనసాగుతున్న హైడ్రా దూకుడు
### రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత



**హైదరాబాద్, ఆగస్ట్26 :** నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవ రినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మా ణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయదుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు.

మిగతా 7 లో

## చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు
- తెలంగాణ వ్యాప్తంగా గుర్తించి చర్యలు
- ఆధారాలతో ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చు
- హైడ్రా చర్యలను సమర్థించిన మంత్రి పొన్నం

3 లో..



# ఢిల్లీకి కేటీఆర్ బృందం
- కవితకు బెయిల్ వస్తుందన్న నమ్మకం
- ఎమ్మెల్యేను వెంటేసుకుని పయనం



**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , హరీష్ రావుతోపాటు 20మంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లారు. లిక్కర్ స్కామ్ లో అరెస్ట్ అయి జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై మంగళవారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. ఖచ్చితంగా బెయిల్ వస్తుందన్న నమ్మకంతో కేటీఆర్ ఉన్నారు. అందుకే జైలు నుంచి వచ్చే కవితకు స్వాగం చెప్పేందుకు అందరితో కలిసి వెళ్తున్నట్లుగా బీఆర్ఎస్ లవర్గాలు చెబుతున్నాయి. కవిత మార్చి పదిహేనో తేదీ నుంచి జైల్లో ఉన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా క్రమంగా దిగజారుతోంది. అదే సమయంలో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితులకు వరుసగా బెయిళ్లు వస్తున్నాయి.

మిగతా 2 లో

## దమ్ముంటే పాతబస్తీ ఆక్రమణలు కూల్చేయండి
### సీఎం రేవంత్‌కు మహేశ్వర రెడ్డి సవాల్
### ప్రజా సమస్యలు పక్కదారి పట్టించే చర్యని విమర్శలు

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** సీఎం రేవంత్ రెడ్డికి దూకుడు ఎక్కువ అని బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఆ దూకుడుతనమే ఇబ్బందిగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దాంతోపాటు పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని నిలదీశారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు.

మిగతా 2 లో






2 లో..

## బండ్లగూడ స్కూల్ కూల్చొద్దు
- కావాలంటే నాపై బుల్లెట్ల వర్షం కురిపించండి
- హైడ్రా చర్యలపై అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు

## వాతావరణ మార్పులు
- వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాల విజృంభణ
- ఇప్పటికే ఆరుగురు మృత్యువాత

3 లో..

## రాష్ట్రంలో డెంగీ మరణాలపై నిర్లక్ష్యం
ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్




## సిఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం
### 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** సీఎంఆర్ఎఫ్ స్కాంలో 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌బాద్‌లో ఉన్న హాస్పటల్స్‌పై కేసులు నమోదు అయ్యాయి. ఈ ఆస్పత్రులు ఫేక్ బిల్లులు పెట్టి క్లెయిమ్ చేసుకున్నట్లు విచారణలో బయట పడింది. వెరిఫికేషన్‌లో హాస్పిటల్ల బాగోతం

మిగతా 2 లో

## ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి
### గతంలో ఇచ్చిన హామీ మేరకు సాగాలి
### సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ఉచితంగా అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఉచితమని చెప్పి.. ఇప్పుడు ఫీజులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. అధికారులకు లక్ష్యాలు విధిస్తూ ప్రజలను వేధిస్తున్నారని విమర్శించారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలయ్యేలా చూసే బాధ్యత భారాస తీసుకుంటుందన్నారు.

మిగతా 2 లో



# కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం

- పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు
- తాను వెళ్లేవరకు మరణించిన స్థితిలో డాక్టర్
- నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

**కోల్‌కతా, ఆగస్ట్26 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించి నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిరది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయంలోకి ఎవరూ రాకుండా గతంలో పోలీసు పహారా ఉండేదని, గత ప్రభుత్వం నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. నైపుణ్యాలు లేకపోవడంతోనే నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోందని అన్నారు. యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తామని, యంగ్ ఇండియా వర్సిటీలో ఏటా 20వేల మందికి శిక్షణ ఇస్తామని వెల్లడిరచారు. వచ్చే విద్యాసంవత్సరంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ సిద్ధమవుతాయని అన్నారు. అయితే గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. త్వరలో అన్ని వర్సిటీలకు నూత న వీసీలను నియమిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, కొందరు ఉద్దేశపూర్వకంగానే నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని, రాజకీయ లబ్ది కోసమే నిరుద్యోగుల ను వాడు కుంటున్నారని అన్నారు. ఉద్యోగ అర్హత పరీక్ష లను వాయి దా వేస్తే నిరుద్యోగులకే నష్టమని, నిరుద్యో గులు చెప్పింది వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తమ ప్రాధాన్యత రైతులు, విద్యార్థులేనని రేవంత్ పేర్కొ న్నారు. నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా మని రేవంత్‌రెడ్డి అన్నారు. 'చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పో తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం.అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపి రఘురామిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్ బృందం

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియాకు బెయిల్ కూడా ఇచ్చింది. కవిత తరఫున ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తున్నారు. దీంతో ఈసారి కవితకు బెయిల్ తప్పకుండా వస్తుందని బీఆర్ఎస్ నమ్మకం పెట్టుకుంది. కవితకు వచ్చే వారంలో బెయిల్ వస్తుందని గత నెలాఖరులో కేటీఆర్ భావం వ్యక్తం చేశారు. అయితే బెయిల్ రాలేదు. వాయిదా పడిరది. ఇప్పుడు విచారణ జరుగుతూండటం.. సీబీఐ, ఈడీ కూడా.. బెయిల్ విషయంలో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం లేదని భావిస్తున్నారు. ఇప్పటికే సుదీర్ఘ కాలంగా కవిత జైల్లో ఉన్నారు. సీబీఐ చార్జిషీట్లు కూడా నమోదు చేసింది. దర్యాప్తుకూడా పూర్తయిందని తెలిపింది. ఈ క్రమంలో బెయిల్ అవకాశాలు మెరుగు పడినట్లుగా బీఆర్ఎస్ న్యాయవిభాగం నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో వైపు రాజకీయ పరమైన కారణాలు కూడా కవితకు బెయిల్ దక్కడానికి కారణం కాబోతున్నాయని కొంత కాలంగా ప్రచారం గుప్పుమంటోంది. కానీ అలాంటి ప్రచారం కోర్టుల్ని అవమానించడమేనని జేపీ నేత బండి సంజయ్ ఘాటుగా తిప్పికొడుతున్నారు. కవితకు బెయిల్ వస్తే.. తర్వాత తెలంగాణలో రాజకీయ పరిణామాలు కూడా వేగంగా మారే అవకాశం ఉంది. కేసీఆర్ చాలా కాలంగా బయట కనిపించడం లేదు. ఆయన పూర్తిగా ఫామ్ హౌస్ కే పరిమితయ్యారు. ఇటీవలి కాలంలో పార్టీ నేతల్ని కూడా కలవడం లేదు. కవిత జైల్లో మగ్గిపోతూండటం వల్లనే ఆయన మానసిక వేదనకు గురవతున్నారని.. కకవిత విడుదలైన తర్వాత కేసీఆర్ రాజకీయంగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని బీఆర్ఎస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. కవితకు మంగళవారం బెయిల్ లభిస్తే ... తీహార్ జైలు నుంచి ఆమెకు పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికే అవకాశం ఉంది. తర్వాత కవిత రాజకీయ భవిష్యత్ పై ఆమె నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# కాశ్మీర్ స్టార్ కాంపెయినర్ ప్రధాని మోడీ

## మొత్తం 40మందితో ప్రచార సారథుల జాబితా

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 26 :** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 15 మంది అభ్యర్థుల తొలి జాబితాను సోమవారం విడుదల చేసిన బీజేపీ తొలి విడత ప్రచారంలో పాల్గొనే 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కూడా విడుదల చేసింది. ఆ ప్రకారం జమ్మూకశ్మీర్ లీడ్ క్యాంపెయిర్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉంటారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, జేపీ నడ్డా తదితరులు సైతం ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉంటారు. కాగా, స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను కూడా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్ తొలిదశ ప్రచారంలో పాల్గొంటారు. బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఇటీవలే జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన రామ్ మాధవ్, జమ్మూకశ్మీర్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ రైనా, ఎంపీ జుగల్ కిషోర్ శర్మ, రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖతన, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) అశోక్ కౌల్, జమ్మూకశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు సోఫి యూసుఫ్ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. 2019లో 370వ అధికరణ రద్దు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించిన తరువాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే కావడం విశేషం.

# దమ్ముంటే పాతబస్తీ ఆక్రమణలు కూల్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

హైడ్రాకు అంత హైప్ తీసుకొచ్చేందుకు కారణం ఇతర అంశాలు పక్కదారి పట్టించేందుకేనని మహేశ్వర రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కూల్చివేతల గురించి జనం చర్చించుకుంటుంటే.. ఇతర అంశాల గురించి మాట్లాడే అవకాశం ఉండదని వివరించారు. ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే హైడ్రాను తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. రుణమాఫీ కాక రైతులు ఇబ్బంది పడ్డారని మహేశ్వర రెడ్డి గుర్తుచేశారు. రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తలొక విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రుణమాఫీ అయ్యింది ఎంత..? ఇంకా ఎంతమందికి రుణం మాఫీ చేయాల్సి ఉందని మహేశ్వర రెడ్డి నిలదీశారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. మంత్రులేమో రూ. 17 వేల కోట్లు మాఫీ చేశామని అంటున్నారు. ఈ రెండు ప్రకటనల్లో ఏది నిజం..? ఎవరి మాటలను నమ్మాలని నిలదీశారు. మంత్రివర్గంలో ఓ ఫేక్ మంత్రి ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

బట్టబయల్కెంది. గతంలో ఇదే స్కాంలో నలుగురిని సీపీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి విషయం తెలిసిందే. రెండు హాస్పిటల్స్ నుంచి 6 లక్షల ఫేక్ బిల్లులను ఆస్పత్రుల నిర్వాహకులు క్లైమ్ చేసుకున్నారు. వీరిపై ఫోర్జరీతో పాటు చీటింగ్ కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో సీఎంఆర్‌ఎఫ్ కుంభోణం తీవ్ర సంచలనం రేపుతోంది. రోగులకు ట్రీట్మెంట్ అందింకుండానే నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులను డ్రా చేసుకున్న పలు ఆస్పత్రులు బాగోతాన్ని సీఐడీ గుర్తించింది. రోగులు లేకుండా, వైద్యం చేయకుండా.. కేవలం కాగితాల్లోనే పెద్ద జబ్బులున్నట్లు పేర్కొంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సీఎంఆర్‌ఎఫ్ నిధులను డ్రా చేస్తున్నారంటూ గత ఏడాది రెవెన్యూ శాఖ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ స్కాం బయటపడిరది. ఈ స్కామ్‌లో ఆసుపత్రుల సిబ్బంది, లోకల్ లీడర్లు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణం వెలుగులోకి రావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. మొత్తం 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది.

# ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలకు ముందు అన్ని ఫ్రీ అన్నారు. ఇప్పుడేమో ప్రతిదానికి ఫీజులు వసూలు చేస్తున్నారంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎల్‌ఆర్‌ఎస్(భూముల క్రమబద్ధీకరణ) పథకాన్ని పూర్తి ఉచితంగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు రుణమాఫీ కాక, రైతు బంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతుంటే, మరో వైపు విషజ్వరాలతో సామాన్య ప్రజలు ఆసుపత్రుల పాలై, ఖర్చులు భరించలేక అల్లాడుతున్నారు. ఇలాంటి ప్రధానమైన సమస్యలను పరిష్కరించి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన మీ ప్రభుత్వం, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ స్థాయి నుంచి పంచాయతీ సెక్రెటరీ వరకు ఉన్న యంత్రాంగం మీద తీవ్ర ఒత్తిడి చేస్తున్నది. పంచాయతీ సెక్రెటరీలు, బిల్ కలెక్టర్లు రోజుకు మూడు నాలుగు సార్లు ఫోన్లు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారు. ఫీజులు చెల్లించకుంటే లేఅవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు. డిమాండ్ నోటీసులు ఇస్తూ మరీ మొత్తం 15వేల కోట్లు వసూళ్లు చేయాలని ఆదేశాలివ్వడమంటే ప్రజల రక్తమాంసాలను పీల్చడమే. మీ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అంటే దోపిడీ అన్న మీరు.. ఈ రోజు ప్రజలనెందుకు దోపిడీ చేస్తున్నారో సమాధానం చెప్పాలి. నాడు ఫ్రీఫ్రీఫ్రీ అని, నేడు ఫీజు ఫీజు ఫీజు అంటున్నారు. ప్రజలు దాచుకున్న సొమ్మును నిలువునా దోచుకునే కుట్ర చేస్తున్నారు. స్వయంగా మీతో సహా ప్రస్తుతం మీ కేబినెట్‌లో సహచరులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వంటి నేతల మాటలను మీకు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని స్పష్టం చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతం

## డ్రైవర్‌లెస్ కారును రూపొందించిన విద్యార్థులు

## వారు ఎవరికీ తీసిపోరని ప్రశంసించిన మంత్రి శ్రీధర్ బాబు

**సంగారెడ్డి, ఆగస్ట్ 26 :** హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతమని ఐటి శ్శఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వారు ఏదైనా అద్భుతం చేయగల సమర్థులని అన్నారు. ఇతర దేశాల పరిశోధనలకు వారేవిరీ తీసిపోరని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. డ్రైవర్ లెస్ కార్లు అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మిగతా దేశాల్లో క్రమంగా అందుబాటులోకి రానున్నాయి. కంది ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు డ్రైవర్ లెస్ కారును రూపొందించారు. ఆ కారులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణించారు. కారులో ప్రయాణం మధురానుభూతి కలిగించిందని వివరించా రు. 'ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉంది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, నేను డ్రైవర్ లెస్ వెహికిల్‌లో ప్రయాణించాం. ఆ ప్రయాణం కంటే ఈ రోజు చేసిన జర్నీ అద్భుతమైన అనుభూతి కలిగించింది. తెలంగాణ రాష్ట్రంలో ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన ఈ టెక్నాలజీ దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. ప్రయోగ దశలో ఉన్న టెక్నాలజీ త్వరలో ఆచరణలోకి రావాలని కోరుకుంటు న్నా. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను అన్ని రంగాల్లో రావాలని అభిలషిస్తున్నా అని' మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అమెరికాలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పర్యటన సాగింది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు డ్రైవర్ లెస్ కారులో జర్నీ చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఈ రోజు కంది వర్సిటీలో డ్రైవర్ లెస్ కారులో మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణిం చారు. మన విద్యార్థులు రూపొందించిన కారు అద్భుతం గా ఉందని ప్రశంసించారు.

# ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 26 :** రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మన రాష్ట్రం నుండి పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుండి ఎక్కువ మంది ఎంపిక అవ్వాలన్నారు. వాళ్లకు ఆర్థిక ఇబ్బంది నీ కొంతైనా తగ్గించాలని లక్ష రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, లక్ష పెద్ద నగదు కాకపోయినా.. కొంతైనా ఉపశమనం కలగాలని మా ప్రయత్నమని భట్టి విక్రమార్క అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఓపెన్ చేస్తున్నామని, ఐదు వేల కోట్లు మౌలిక వసతుల కోసం ఖర్చు చేయబోతున్నామన్నారు. గత ప్రభుత్వం 3 వేల కోట్లు ఖర్చు చేస్తే..మేము ఐదు వేల కోట్లు పెడుతున్నామని, విద్యకు అంత ప్రాధాన్యత ఇస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీ తో యువతకు ఉపాధి కల్పన కి కృషి చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఈ దేశ చరిత్రలో ఎవరూ కూడా ఆలోచన చేసి ఉండరని, పెద్ద ఎత్తున ఈ స్కూల్స్ మొట్ట మొదటి సారి మొదటి సంవత్సరంలోనే రూ. 5 వేల కోట్లతో నిధులు ఖర్చుపెట్టబోంతోందన్నారు. రాష్ట్రంలో గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కోసం సంవత్సరానికి రూ.3 కోట్లు ఖర్చుపెట్టేదని, కానీ ఈ సంవత్సరం మేము రూ. 5 వేల కోట్లకు పెంచామని ఇది మా ప్రాధాన్యత అని చెప్పుకొచ్చారు. విద్య కోసం అంగన్వాడి దగ్గర నుంచి మొదలు కొని ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు. హైయర్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ పై ఫోకస్ పెట్టామన్నారు. మరోవైపు నేడు రాష్ట్రానికి 4వ సిటీ రాబోతుందని, ఆ ప్రాంతంలో స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో ఇండస్ట్రీలకు అనుగుణంగా సిలబస్‌ను తయారు చేసేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ వర్సిటీలో చదివిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. దాదాపు రాష్ట్రంలోని 63 ఐటీఐలు కళాశాలలు మూసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఆ ఐటీఐలను అడ్వాన్స్ స్కిల్ సెంటర్ లుగా భవిష్యత్తులో అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు.

# లారీ బ్రేకులు ఫెయిల్

## వరుసగా గుద్దుకున్న వాహనాలు

## ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

**చెన్నై, ఆగస్ట్ 26 :** లారీ బ్రేక్ ఫెయిలవ్వడంతో ముందున్న కారును ఢీకొట్టగా వెనుకనుండి 4 వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, 14 వాహనాలు ధ్వంసమయ్యాయి. తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా హొసూరు సమీపంలోని పేరండ్లపల్లి వద్ద జాతీయ రహదారి బెంగళూరు - క్రిష్ణగిరి హైవే పై ఇరువైపులా కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయింది. గ్రానైట్‌తో వెళుతున్న లారీ బ్రేక్ ఫెయిల్ అయ్యి కారుని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ వెనకే వస్తున్న పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. మొత్తం 15 వాహనాలు ఢీకొనగా.. 14 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. 10మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. 8 కార్లు, రెండు బస్సులు, 4 లారీలు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రులను హొసూరు, క్రిష్ణగిరి ఆసుపత్రులకు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల కిరాతకం

- ప్రయాణికులపై దుండగుల కాల్పులు
- 23 మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

**లాహెూర్, ఆగస్ట్ 26 :** పాకిస్థాన్‌లో దారుణం చోటు చేసుకుంది. కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్ లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడిరచింది ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ ఈ దాడిని తీవ్రంగా ఖండిరచారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలోనూ ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. గతేడాది అక్టోబర్‌లో పంజాబ్‌కు చెందిన ఆరుగురు కూలీలను గుర్తుతెలియని సాయుధులు కాల్చి చంపారు. బలూచిస్థాన్‌లోని కెచ్ జిల్లాలో ఆ దారుణం చోటుచేసుకుంది. అవి లక్షిత హత్యలని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. 2015లో జరిగిన ఘటనలో 20 మంది నిర్మాణ రంగ కార్మికులు కన్నుమూశారు.



# చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు

- తెలంగాణ వ్యాప్తంగా గుర్తించి చర్యలు
- ఆధారాలతో ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చు
- హైడ్రా చర్యలను సమర్థించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ప్రజానావ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హైడ్రా చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. ముందు రాజధాని నగరంలో, తరువాత అన్ని జిల్లాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయో వివరాలు సేకరించి వాటిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం నుండి వాతావరణాన్ని పరిరక్షించుకోవడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి గతంలో ఉన్న చెరువులకు ప్రభుత్వ లెక్కలకు రికార్డులకు అనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పరిరక్షించుకోవాలని స్వచ్ఛంద సంస్థలకు, గతంలో ఇక్కడ చెరువు ఉండే అని తెలిసిన వారు స్థానికులు ఎవరైనా పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే పని.. చెరువుల పరిరక్షణ స్థానికులదేనని అన్నారు. ప్రభుత్వానికి ఎవరి మీద రాజకీయ కక్ష సాధింపు లేదని తేల్చి చెప్పారు. హైడ్రాకు ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది.. ప్రభుత్వం చేస్తున్న పనిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్శిస్తున్నారన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగింది అంటే న్యాయ స్థానాలు ఉన్నాయని అన్నారు. చెరువుల పరిరక్షకులు అందరూ ఎక్కడెక్కడ అక్రమణకు గురయ్యాయో వాటి ఆధారాలు సంబంధిత అధికారులకు ఇవ్వాలన సూచించారు. 33 జిల్లాల్లో ఎక్కడైనా గ్రామాలు, మండలాలు, పట్టణాలు, మున్సిపాలిటీ చెరువులు ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాల్లో మీకు ఉన్న అవగాహన, ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకురండని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

**బిఆర్ఎస్ విమర్శలపై మండిపడ్డ కోదండరెడ్డి**
**రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలు కూల్చేయాలన్న నేతలు**

**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, నాలాలు రక్షిస్తోందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడు తూ... దూరదృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కమిటీ కూడా గతంలో వేసిందే అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజన కాకముంటే కాంగ్రెస్ సర్కార్ 2030 వరకు హెచ్ఎమ్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు. తాగునీటి అవసరాల కోసం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేక్స్ ప్రొటెక్షన్ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అక్రమ నిర్మాణాలకుమద్దతు చేసిందని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు చేసి ప్రజల మన్నన్నలు పొందుతున్న సీఎం రేవంత్‌పై ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రజలు కూడా ర్యాలీ చేస్తున్నారన్నారు. హుస్సేన్ సాగర్ కాపాడుకోవాలని విజయభాస్కర్ రెడ్డి కాలంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు, నెక్లస్ రోడ్ ఏర్పాటైందన్నారు. తొమ్మిదన్నరేళ్ల కాలంలో చెరువులను ఎందుకు కాపాడలేదని హరీష్ రావును కోందండరెడ్డి ప్రశ్నించారు. కేవలం ప్రబుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతిని కాపాడడానికి చెరువులు కాపాడాలన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి నీటిని తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ సర్కారే రానున్న 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ధర్మం కోసం భగవత్ గీతను కూడా స్ఫూర్తిగా తీసుకున్నా అని సీఎం రేవంత్ నిన్న చెప్పారన్నారు. హెచ్ఎండీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కోదండరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తరించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్ప, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు.

అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయ దుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# బండ్లగూడ స్కూల్ కూల్చొద్దు

- కావాలంటే నాపై బుల్లెట్ల వర్షం కురిపించండి
- హైడ్రా చర్యలపై అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని అక్బరుద్దీన్ సూచించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇతరులు కబ్జా చేసిన భూముల గురించి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. సీఎం రేవంత్.. మీకు దమ్ముంటే ఆ నిర్మాణాలు కూల్చివేయాలని ఓపెన్ ఛాలెంజ్ చేస్తున్నారు. పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు. మహేశ్వర రెడ్డి కామెంట్ చేశారో లేదో.. ఆ వెంటనే అక్బరుద్దీన్ ఓవైసీ స్పందించారు. ద యచేసి ఆ స్కూల్ కూల్చొద్దు అని కోరారు. పేద విద్యా ర్థుల ఆ పాఠశాల వరం లాంటిదని కోరారు. కొందరు కావాలనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్ అంటేనే మొండిచేయి

**రుణమాఫీపై మరోమారు కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, ప్రజానావ :** రైతు రుణమాఫీ అంశంలో బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఆగడం లేదు. పూర్తి రుణమాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నారు. కానీ రుణమాఫీ ఓ బోగస్ అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇప్పటికే ఈ పథకంపై అనేక విమర్శలు చేశారు. ఇంకా రైతులకు పూర్తిగా మాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల ఖాతాల్లో నగదు వేసినట్లు గొప్పలు చెప్పుకుంటుందని మండిపడు తున్నారు. తాజాగా రుణమాఫీ అంశంపై కేటీఆర్ మరోసారి స్పందించారు. రుణమాఫీ అయిన రైతులకన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా ఎందుకు మాఫీ కాలేదో చెప్పేవారు లేరంటూ ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు పంట సీజన్లు గడిచినా రైతుభరోసా ఇంకా షురూ చెయ్యలేదు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా ఆగస్టు దాటుతున్నా లబ్దిదారుల ఖాతాల్లో వెయ్యలేదు. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15వేలు ఇంకా ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు. కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి చూపించే పార్టీ అని తేలిపోయిందని అన్నారు.

### ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్

రాష్ట్రంలో డెంగీ మరణాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతుంది. కానీ వార్తా పత్రికల్లో మాత్రం ఒక్కరోజులో ఐదు మంది డెంగీతో చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. డెంగీతో మరో ముగ్గురు చనిపోయినట్లు ఇవాళ కూడా వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ డేటాను ఎవరు దాచిపెడుతున్నారు..? ఎందుకు దాచిపెడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవు.. చాలా హాస్పిటల్స్‌లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి, రాష్ట్రంలో హెల్త్ ప్రకటించాలని సీఎస్ శాంతికుమారికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రముఖుల కృష్ణాష్టమి శుభకాంక్షలు

**గవర్నర్, సీఎం, విపక్ష నేతల అభినందనలు**

**హైదరాబాద్, ప్రజానావ :** గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని వారు ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవి. మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడు. ఆ శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని ప్రార్థిస్తున్నా' అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు!' అని కేసీఆర్ పోస్ట్ చేశారు. ' వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్. శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ పేర్కొన్నారు.

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తెలుగు రాష్ట్రాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. శ్రీ కృష్ణుడి ఆలయాల ముందు భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌లో ప్రముఖ ఇస్కాన్ టెంపుల్, హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్, శ్రీ రాధాకృష్ణ దేవాలయం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్ని కృష్ణయ్యకు ప్రీతిపాత్రమైన పాలు, నెయ్యి, వెన్నె తదితర ఆహార పదార్థాలను నైవేద్యం సమర్పించడానికి క్యూ కట్టారు. తెలంగాణ, ఏపీలోని అన్ని జిల్లాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖులు ఆలయాల బాట పట్టారు.

# రాష్ట్రంలో వాతావరణ మార్పులు

**వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాల విజృంభణ**
**ఇప్పటికే ఆరుగురు మృత్యువాత**



**హైదరాబాద్, ప్రజానావ :** తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి - సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి - సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ - ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ - కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళ్తుండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్బో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరికొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజులో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడుతున్నారని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ మండలం కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్ట మి వేడుకలు గొల్ల కుర్మ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గొల్ల కుర్మ సంఘం రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్, జహీరాబాద్ రూరల్ సి ఐ జక్కుల హనుమంత్ లు వచ్చి వేడుకలు తిలకించారు. గొల్ల బిర్లవారు డోలు చప్పుల్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక మల్లన్న స్వామి మందిరం దగ్గర శ్రీ కృష్ణుని చిత్రపటానికి పూజలు చేసారు. శ్రీ కృష్ణ వేశాధారణ లో ఉన్న చిన్ని కృష్ణతో ఉట్టి గొట్టే కార్యక్రమం అహల్లాదకరంగా సాగింది. కార్యక్రమానికి తిలకించేందుకు వచ్చిన అతిథులకు కుల పెద్దలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గొల్లకుర్మ సంఘ రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు యాదవుల వంశంలో పుట్టి ఈ లోకాని చెప్పిన హిత భోదనల ద్వారా ధర్మం గురించి మానవాళికి నేర్పిన భగవానుడు శ్రీకృష్ణుడని అన్నారు. తన బాల్యమంతా జీవన్మరణ పోరాటాలతో సాగింది. కరువు, ఇంకా అడవి తోడేళ్ళ ముప్పు వలన శ్రీకృష్ణుని 9 ఏళ్ల వయసులో గోకులం నుంచి బృందావనంకి మారవలసి వచ్చింది. 16 ఏళ్ల వయసు వరకు బృందావనంలో ఉన్నాడు. తన సొంత మేనమామ కంసుడిని 14-16 వయస్సులో మధురలో చంపి తనను కన్న తల్లిదండ్రులను చెరసాల నుంచి విముక్తి కలిగించాడు. శ్రీకృష్ణుడు ద్వారకను పునర్నిర్మించారు. విద్యాభ్యాసం కొరకు 16-18 ఏళ్ల వయసులో ఉజ్జయినిలో గల సాందీపని యొక్క అశ్రమమునకు తరలివెళ్ళెను. తన విద్యాభ్యాసం తరువాత పాండవుల వనవాసమును గురించి తెలుసుకుని వారిని లక్క ఇంటి నుంచి కాపాడి తదుపరి తన సోదరి అగు ద్రౌపదిని పాండవులకు ఇచ్చి పెండ్లి చేసెను. పాండవులతో ఇంద్రప్రస్థం అను నగరమును ఏర్పాటు చేసి రాజ్యమును స్థాపింప చేసెను.

ద్రౌపదిని వస్త్రాపహరణం నుంచి కాపా డి, పాండవులకు తోడుగా ఉండి కురుక్షేత్రంలో విజయమును వరించునట్టు చేసి ధర్మస్థాపన గావించిన భగవానుడు శ్రీకృష్ణుడని అన్నారు. కార్యక్రమంలో విజేందర్‌రెడ్డి, ఓంకార్ యాదవ్ మారుతియాదవ్, శివరాజ్ యాదవ్, భోజగొండ శివరాజ్, అశోక్ చల్కి, న్యాల్ కల్ గ్రామ అధ్యక్షులు గొల్ల నర్సిములు, గోపాల్, పాతి నర్సిలు, మల్లేష్, గంగ్వర్ దిగంబర్ శ్రీనివాస్, దత్తు యాదవ్, గొల్ల రాములు, శ్రీనివాస్, భీరప్ప, బీరన్న, గుండప్ప, రాజు, శ్రీపతి, నాగన్న, గొల్ల రాజు, హనుమంత్, కె మల్లేష్, పి రాజు, బి మల్లప్ప, మారుతి, జగనాథ్, యాదవ్, గొల్ల శ్రీశైలం, కృష్ణ పెద్దగొల్ల ఉన్నారు.



## వినాయక మండపాల
# నిర్వాహకులతో సమావేశం

- ఎట్టి పరిస్థితుల్లో డీజేకు అనుమతి లేదు
- ఎస్సై కదిర శ్రీకాంత్ గౌడ్

**ఇల్లంతకుంట :** మండలంలోని గణేష్ మండపాల వద్ద డీజేలు పెట్టకూడదని ఎస్సై కదిర శ్రీకాంత్ గౌడ్ తెలి యజేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో మం డలంలోని డీజే నిర్వహకులతో ఒక ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేయడం జరిగినది. గణేష్ నవరా త్రులలో భాగంగా మండపాల దగ్గర డీజేలు నిర్వహించకూడదని పూజా కార్యక్రమాల నిమిత్తం చిన్నపాటి బాక్సులు పెట్టుకొని నిర్వహించుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్క గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ స్టేషన్ నందు ఆ నిర్వాహకులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## మాల మహానాడు గ్రామ
# యువజన కమిటీ నియామకం



**ఇల్లంతకుంట :** గ్రామ మాల మహానాడు యువజన సంఘం అధ్యక్షులుగా మామిడి హరీష్, ఉపాధ్యక్షులుగా మామిడి మల్లికార్జున్, జక్కుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాకం సుమన్, కార్యదర్శిగా మామి డి శ్రీనివాస్(అప్పు), సహాయ కార్యదర్శిగా మామిడి రాజు, కోశాధికారిగా మామిడి చందు, సభ్యులుగా మామిడి కమలాకర్, మామిడి రాజేల్లం, మామిడి రజనీకాంత్, గుమ్మడి హరీష్, గౌరవ అధ్యక్షులుగా జక్కుల రాజు, చాతర్ల రాజు లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మామిడి హరీష్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధితో పాటు ఎస్సి, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల సూచనల మేరకు పోరాటం చేస్తామని అన్నారు. అలాగే యువకులకు అన్ని విధాలుగా సహకరిస్తూ అందరిని కలుపుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మాల మహానాడు యువజన సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# డిజే సీజ్ కేసు నమోదు

**తంగళ్ళపల్లి, :** మండలంలో అక్రమంగా డీజే ను నడుపుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై డి సుధాకర్ తెలిపారు. నిన్న రాత్రి అనగా 25-08-2024 రోజున అర్ధరాత్రి తంగళ్ళపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా డీజే సిట్టింగ్ లు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తంగళ్ళపల్లి ఏఎస్సై చంద్రమౌళి, మరియు సిబ్బంది ప్రశాంత్ సతీష్ లతో కలిసి కి అంకిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లగా అక్కడ డీజే లను నిర్వహించి ప్రజల యొక్క ఆరోగ్యానికి హాని కలిగేలా పెద్ద పెద్ద శబ్దాలతో డీజేలు నిర్వహిస్తున్న సౌండ్ సిస్టం లని సీజ్ చేయడం జరిగింది అని డీజేలు నిర్వహించడంతో పాటు దారిపైన గుమిగూడి రాకపోకలకు అంతరా యం కలిగించి న్యూసెన్స్ చేసిన అట్టి డీజే సిస్టం లను సీజ్ చేసుకుని డీజే యజమాని తో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరిగిందని మరియు డీజే సిస్టం లతో పాటు వాహనాన్ని సీజ్ చేశామని ఆయన తెలిపారు.

## కారుణ్య నియామకాల
# ఉత్తర్వుల అందజేత



**రామగిరి (పెద్దపల్లి) :** రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన 10 మందికి కారుణ్య నియామక ఉద్యోగాల ఉత్తర్వులను సోమవారం జి.ఎం. కార్యాల యంనందు నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జీ-3 జీ.ఎం ఎన్.సుధాకర రావు అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన ప్పటికీ ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని, అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ, అధికారులు, సూపర్ వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహించాలని కోరారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరం లాంటిదని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావద్దని, సీనియర్ ఉద్యోగుల దగ్గర క్రమశిక్షణతో పని నేర్చుకొని, కలిసి కట్టుగా పనిచేసి ముమ్మందు మంచి పదోన్నతులు సాధించి కుటుంబం తో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివైపిఎం వి.సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ గస్తీ
# వాహన సిబ్బంది ఔదార్యం



**మందమర్రి :** పట్టణంలో పోలీస్ గస్తీ వాహన సిబ్బంది రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి ఔదార్యం చాటారు. సోమవారం పట్టణంలోని కమ్యూనిటి హాల్ సమీపంలో కారుకు, ద్విచక్ర వాహనానికి జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడిని గమనించిన అటువైపుగా వెళ్తున్న పోలీస్ గస్తీ వాహనంలోని ఏఎస్ఐ భగవత్, హెడ్ కానిస్టేబుల్ ఉత్తం, హెూంగార్డ్ దాసరి శ్రావణ్ కుమార్ లు ప్రథమ చికిత్స అందించి, ఆసుపత్రికి తరలించారు. అనంతరం యువకున్ని సంబంధీకులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా పోలీస్ గస్తీ వాహన సిబ్బందిని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, పలువురు అభినందించారు.



# మాదిగలకు వ్యతిరేక ఉద్యమం కాదు

- రిజర్వేషన్లు కాపాడడమే మా లక్ష్యం
- వర్గీకరణకు వ్యతిరేకం మాత్రమే
- వర్గీకరణ అనేది రాజ్యాంగ విరుద్ధం
- నిజమైన అంబేద్కరిస్టులు గా రాజ్యాంగాన్ని కాపాడుతాం
- మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రాజ్ కుమార్


**ఎల్లారెడ్డిపేట :** మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వ ర్యంలో మండల హడక్ కమిటీ ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రాజ్ కుమార్ మరియు మాల మహానాడు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రొడ్డ రామచంద్రం ఈ కార్యక్రమానికి హాజరై "మేం మాదిగలకు వ్యతిరేకం కాదు. కావాలని అగ్రవర్ణ పార్టీలు మమ్మల్ని వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నారు" నిజమైన అంబేద్కరిస్టు గా మేము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాం కనుక వర్గీకరణ అనే అంశం రాజ్యాంగ విరుద్ధం కావున దానికి వ్యతిరేకంగా పోరాడడం అంబేద్కరిస్టులుగా మా బాధ్యత... దేశంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు షెడ్యూల్ కులాల్లోని వారందరిని విభజించి పాలించాలనే ఉద్దేశంతో మాత్రమే వర్గీకరణ అంశాన్ని మద్దతిస్తున్నాయని అది దేశంలోని షెడ్యూల్ కులాల వినాశనానికి కారణవవుతుందని అన్నారు. అలాగే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి మాలలపై కోపంతో వర్గీక రణను మద్దతిస్తూ అసెంబ్లీలో వర్గీకరణ నీ చేస్తామని తన అగ్రవర్ణ కుట్రను బయటపెట్టాడు. రేవంత్ రెడ్డికి షెడ్యూల్ కులాల్లోని సమస్యలు పరిష్కరించడం తెలియదు కానీ వారి మధ్య చిచ్చులు పెట్టి గెలవడం మాత్రం తెలుసు అని అన్నారు. వర్గీకరణ అనే భూతాన్ని ముందు పెట్టి భవిష్యత్తులో రిజర్వేషన్లు తీసేయాలని కుట్ర తోటే అగ్రవర్ణ పార్టీలు ఈ ద్రోహానికి పాల్పడుతున్నాయని అన్నారు. మళ్లీ 2000 సంవత్సరాల వెనుకకు తీసుకెళ్లి షెడ్యూల్ కులాల ను బానిసల్లాగా ఎలాంటి హక్కు లేకుండా చేయాలనేది వాళ్ళ కుట్ర అని అన్నారు. ఉత్తర భారత దేశంలో చమర్ లు వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. మం దకృష్ణ నే మాదిగ వర్గాన్ని బిజెపికి, ఆర్ఎస్ఎస్ కి అమ్మేస్తున్నారు. వర్గీకరణ ఉద్యమం అని మాదిగలకు చెప్పి వారి మనోభావాలను స్వార్థంకు ఉపయోగించుకొని మాదిగలను మోసం చేస్తూ మిగతా ఉపకులాల పైన విషం జల్లే ప్రయత్నం చేస్తున్నాడు మందకృష్ణ మాదిగ. గత కొద్దికాలం నుండి మందకృష్ణ బిజెపికి షెడ్యూల్ కులాలకు శత్రువు అయినటువంటి ఆర్ఎస్ఎస్ కు బంటులా పని చేస్తున్నాడని, అలాంటి వ్యక్తి మాలలను మనువాదులు అనడం హాస్యాస్పదంగా ఉంది. వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేద్కరిస్టులు పాల్గొంటారని వారికి రాజ్యాంగమే ప్రధాన ఎజెండా అని వారికి మాల, మాదిగ , మిగతా ఉప కులాలు అనే తేడా ఉండదని స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ నిజంగా అంబేద్కరిస్టు అయితే షెడ్యూల్ కులాల్లోని రిజర్వేషన్లు 15 నుండి 30 శాతానికి పెంచాలని ఉద్యమం చేయాలి. షెడ్యూల్ కులాలను విభజించే ఉద్యమాన్ని విడిచిపెట్టాలని అన్నారు. మాయావతికి, చంద్రశేఖర్ ఆజాద్ ప్రత్యేక కృతజ్ఞతలు వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు అయిన మాయావతి కి మరియు ఆజాద్ సమాజ్ పార్టీ అధ్యక్షుడైన చంద్రశేఖర్ ఆజాద్ కి షెడ్యూల్ కులాల్లోని ఉపకులాల మరియు వర్గీకరణ వ్యతిరేక కమిటీ తరఫునుండి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. హాడక్ కమిటీ మండల కన్వీనర్ గా ఎడ్ల సందీప్ ని నియమించారు. ట్రెజరర్ గా గట్టుపల్లి రవి, కో కన్వీనర్లుగా సుంకరి రాజమల్లు, ఉడుగుల సురేందర్, రామిండ్ల సూర్యం, కొర్రీ అనిల్, కడగొండ అంజయ్య, పాటీ నరసింహులు, ఉత్తం బాలయ్య, గడ్డి సురేష్, చంటి నరసయ్య, అంబటి రవి, నీరటి రాజు, రేసు జగన్ లు నియామకమయ్యారు.



## సీఎం రిలీఫ్ ఫండ్‌లో అక్రమార్కులను
# కఠినంగా శిక్షించాలి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్

**కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ కుంభకోణానికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుపేద ప్రజలు వైద్యం కోసం ఉపయోగించే సీఎం రిలీఫ్ ఫండ్ లో కూడా కొన్ని ఆసుపత్రులు అవినీతి, అక్రమార్గాలకు పాల్పడడం సిగ్గుచేటైన చర్య అని ఇలాంటి ఆసుపత్రులపై చట్టరీ త్యా చర్యలు తీసుకుని బాధ్యులైన వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి శిక్షించాలని యుగంధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు రోగులకు చికిత్స అందించకుండానే నకిలీ బిల్లులతొ సి.ఎం.ఆర్.ఎఫ్ నిధులుకొట్టేస్తు మోసాలకు పాల్పడుతున్నారని ప్రజల సొమ్మును లూటీ చేస్తున్న ఈ ఆసుపత్రులపై, ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు. తీసుకోవాలన్నారు. పేదల ప్రజల డబ్బులతో ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్న ఈ అక్రమ దందాను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్‌అందే విధంగా చర్యలు తీసుకోవాలని యుగంధర్ అన్నారు.



## కరీంనగర్‌లో హైడ్రా తరహా
# అథారిటీ ఏర్పాటు చేయాలి

- సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజు

**కరీంనగర్ :** నగరంలో అనేక ప్రాంతాల్లో పూర్తిగా చెరువులు, కుంటలు కబ్జాలమ యమయ్యాయని వీటిలో జరిగిన అక్రమ కట్టడాలను తొలగించి ప్రజలకు చెరువులు, కుంటలను అందుబా టులోకి తీసుకురావాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్ నగరాన్ని ఆనుకుని ఉన్న అలుగునూర్, బొమ్మకల్, తీగలగుంట పల్లి, ఆరేపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, కొత్తపల్లి, చింత కుంట పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు పూర్తిగా అక్రమ కట్టడాలు వెలిచాయని దీంతో వర్షం వస్తే ఆ ప్రాంతాల్లో నీరు ఎటు పోలేని పరిస్థితి నెలకొందని ఈ అక్రమాల వెనుక కొందరి ప్రజాప్రతినిధుల హస్తం కూడా ఉందని పేర్కొన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ విలీన గ్రామాలతో పాటు సమీపంలోని గ్రామాలలో చెరువులు, కుంటలు శిఖాలలో అక్రమంగా షెడ్లు, బిల్డింగులు నిర్మిస్తున్నారని పక్కనే ఉన్న పట్టా భూమి సర్వేనెంబర్ తొ కొనుగోలు చేసి దాన్ని ఆసరాగా తీసుకుని క్రమంగా చెరువులు, కుంటలు శిఖములను కలిపి వేస్తున్నారని ఇలా కోట్లాది రూపాయల విలువైన భూములు అక్రమార్కులు అన్యాక్రాంతం చేసినారని ఆరోపించారు. హద్దులు పాతి నీటి వనరులను కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవని ఇదంతా ఈ అధికారుల సహకారంతో జరుగుతుందనే అనుమానం ప్రజల్లో ఉందని ఆయన ఆక్రోషం వ్యక్తం చేశారు. దీనికి తోడు లోయర్ మానేరు డ్యామ్ ఎఫ్.టి.ఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని ఎఫ్.టి.ఎల్ పరిధిలో బిల్డింగులు, ఫంక్షన్ హాల్, గోదాంలు, రేకుల షెడ్లు వెలుస్తున్న కొందరు కబ్జాదారులు ప్లాన్ ప్రకారం ముందస్తుగా నీటిలో మట్టి, రాళ్ల రప్పలు వేసి పక్కనున్న బై నెంబర్లు వేసి కాలి ప్లాట్లుగా అమ్మేస్తు అమాయకపు ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. వెంటనే ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంచార్జ్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి చొరవ తీసుకుని కరీంనగర్ జిల్లాలో అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలు, మానేరు పరివాహక ప్రాంతాలను త్వరితగతిన అక్రమ కట్టడాలను నిర్మాణాలను తొలగించాలంటే హైడ్రా లాంటి అథారిటీ కమిటీ కరీంనగర్లో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలు హర్షిస్తారని ఒక ప్రకటనలో కోరారు.





# రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

**వేములవాడ, ప్రజానావ :** శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు ధర్మగుండంలో స్నానాలాచరించి స్వామి వారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండడంతో రాజన్న దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఇదిలాఉంటే బ్రేక్ దర్శన టికెట్లను ఈవో ఈవో వినోద్ రెడ్డి పరిశీలించారు. శ్రావణమాస సోమవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఈవో వినోద్ రెడ్డి క్షేత్రస్థాయిలో బ్రేక్ దర్శనం టికెట్లను పరిశీలిస్తున్నారు.భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.



# డీజేకు అనుమతి లేదు

- శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ పండగను జరుపుకోవాలి
- ఎల్లారెడ్డిపేట సీఐ బీ.శ్రీనివాస్
- వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం

**ఎల్లారెడ్డిపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయి శివ గార్డెన్స్ లో సోమవారం వినాయక మండపాల నిర్వాహకులతో ఎల్లారెడ్డిపేట పోలీసులు సమావేశం ఏర్పాటు చేశారు. నిర్వాహకులతో ఎల్లారెడ్డిపేట సీఐ బీ.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో వినాయక పండుగను జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమర్జనం రోజు డీజే కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదని, ఎవరైనా పోలీసుల విజ్ఞప్తిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అన్ని మండపాల నిర్వాహకులు ఒకేరోజు నిమర్జనం అయ్యేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని వారు అన్నారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట ఎస్ఐలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేతో బాధితులకు
# సత్వర న్యాయం



**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**సిరిసిల్ల, ప్రజానావ:** బాధితులకు సత్వర న్యాయం చేయడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా నేరుగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## గురుకుల జూ.కాలేజీలో
# 28న స్పాట్ అడ్మిషన్స్

**సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి**

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకుల రెసిడెన్షియల్ కళాశాల (ఎస్సీ) ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఎంపీసీలో 15 బైపీసీలో 6సీట్లు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. అర్హత గల విద్యార్థులు వారి విద్యార్హతల రెండు జిరాక్స్ సెట్లతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.



## రాజన్న ఆలయంలో
# అంతర్గత బదిలీలు

**పలువురికి స్థానచలనం**

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతోపాటు శ్రీస్వామి వారికి సమర్పించే నైవేద్యంలో అలసత్వం ప్రదర్శించిన అంశాన్ని ఈవో కొప్పుల వినోద్ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. 20 మంది సిబ్బందిని అంతర్గత బదిలీ చేశారు. గోదాం పర్యవేక్షకుడు వారి నర్సయ్యను గోశాల, టెంపుల్ అండ్ పార్కింగ్ సానిటేషన్, హౌస్ కీపింగ్‌కు, పర్యవేక్షకుడు వెలి సంతోష్‌కు అకౌంట్సుతో పాటు అదనంగా గోదాం బాధ్యతలు అప్పగించారు. మరో పర్యవేక్షకుడు జి.అశోక్‌ను ప్రస్తుతం ఉన్న బాధ్యతలతో పాటు నిత్యాన్నదానం, పార్కింగ్ సానిటేషన్, అన్ని వసతి గదుల్లో హౌస్ కీపింగ్ బాధ్యతలు చూడాలన్నారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా 9 మంది సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ఈఆర్వీ భీమేశ్వర్కు అకౌంట్స్, భారత్ గ్యాస్, వి.శ్రీకాంత్‌కు భీమేశ్వర సదన్, పార్వతీపురం వసతి గదుల ఇన్‌స్పెక్టర్‌గా, ఎస్.సురేశ్‌కు పూజల స్టోర్స్ తోపాటు ప్రధానాలయం ఇన్‌స్పెక్టర్‌గా, వి.శ్యాంకు సబ్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎడ్ల శివసాయికి ప్రోటోకాల్ ఆఫీస్, సబ్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్‌గా, టి.రాజేశ్వర్‌రావుకు మెయిన్ టెంపుల్ స్పేర్‌తో పాటు సబ్ టెంపుల్స్ ఇన్ స్పెక్టర్-3గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎం.నర్సింహకు కల్యాణకట్ట, బి.శంకర్‌కు మెయిన్ బుకింగ్ కౌంటర్, బి.లక్ష్మీనర్సయ్యకు ఎ-1 సెక్షన్‌తో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్ విధులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు రవికి గోశాలతో పాటు భారత్ గ్యాస్, కె.సింహాచార్యులుకు ప్రోటోకాల్ సెంటర్, ఐదుగురు రికార్డు అసిస్టెంట్లు ఎన్.సుశీల కు మెయిన్ బుకింగ్, పి.మల్లేశంకు విచారణ కార్యాలయం క్లర్క్, టి.అజయ్కుమార్కు విచారణ కార్యాలయం క్లర్క్, డి.మమతకు కల్యాణకట్ట-2, ఆర్.చంద్రమౌళికి కల్యాణకట్ట -1 బాధ్యతలు అప్పగించారు. బి.రమాదేవి పరిచారకను మెయిన్ టెంపుల్ స్పేర్‌కు బదిలీ చేశారు. ఇదిలాఉంటే రాజన్న ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరగడంతో ఈవో వినోద్‌రెడ్డి స్వయంగా కౌంటర్లు, చెకోపోస్టులు, క్యూలైన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు సిబ్బందికి ఎప్పటికప్పుడు విధులు కేటాయించారు.



# విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు గాయాలు

**ఎల్లారెడ్డిపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ హెల్పర్ కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ములకనపల్లి దేవరాజ్ (43) గ్రామ హెల్పర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సబ్ స్టేషన్ సమీపాన ఓ ట్రాన్సఫార్మర్పై లైన్ మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగి కరెంట్ షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే గమనించిన స్థానికులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు.

# డీజే నిర్వాహకులపై కేసు

**తంగళ్లపల్లి, ప్రజానావ:** అక్రమంగా డీజేను నడపడమే కాకుండా డీజే సిట్టింగులు నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్ఐ డీ సుధాకర్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ డీజే నిర్వహించడమే కాకుండా రాకపోకలకు అంతరాయం కలిగించారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై చంద్రమౌళి సిబ్బంది ప్రశాంత్, సతీష్‌లతో కలిసి అంకిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లగా డీజే సిస్టంలను సీజ్ చేయడంతో పాటు యజమాని మీరుపాల సతీష్, నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మరియు డీజే సిస్టం లతో పాటు వాహనాన్ని సీజ్ చేశామని ఆయన తెలిపారు.





# కృష్ణాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పునస్కరించుకొని ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్ పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన కొంతం రమేశ్ , ప్రమీల దంపతుల కూతురు కొంతం రమ్య (22) సోమవారం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆటో ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఆటో బైక్ కి తగలగా బైక్ కింద పడింది. దీంతో వెనక వైపు నుండి వస్తున్న బస్సు ఢీకొనగ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలు కాగా ,రమ్య అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి.

# క్రిస్మస్ కానుకగా డిసెంబర్‌లో గేమ్‌ఛేంజర్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ దాదాపు పూర్తి అయినట్టు తెలుస్తోండగా.. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఈ చిత్రం విడుదలకు సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట హల్ చల్ చేస్తూనే ఉంది. గేమ్ ఛేంజర్ రిలీజ్ డేట్‌పై ఎప్పుడు క్లారిటీ వస్తుందా అని డైలామాలో ఉండిపోయిన అభిమానుల కోసం ఆసక్తిక వార్త ఒకటి ఇండస్టీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. రాంచరణ్ పీఆర్ టీం ప్రకారం గేమ్ ఛేంజర్ ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటివరకు వచ్చిన వార్తలను కొట్టిపారేస్తూ.. తాజాగా ఇచ్చిన సమాచారంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. విడుదల తేదీపై ఇక అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని తెలియడంతో ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు అభిమానులు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో రాంచరణ్ కథానుగుణంగా తండ్రీ కొడుకులుగా కనిపించబోతున్నట్టు తెలుస్తోండగా.. తండ్రి పాత్రకు జోడీగా అంజలి కనిపించనుందట. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తున్నాడు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు.




# డబ్బు, పలుకుబడి, రాజకీయ అండ

## చిత్రసీమలో క్యాస్ట్ కౌచింగ్‌పై గాయని చిన్మయి



మళయాల చిత్రసీమలో క్యాస్ట్ కౌచింగ్‌పై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ పై గాయని చిన్మయి తొలిసారి స్పందించారు. కమిటీ పనితీరును ఆమె ప్రశంసించారు. వుమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సిద్ధం చేయగలిగిందని చిన్మయి తెలిపారు. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారిందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అభిప్రాయపడ్డారు. వుమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ వల్లే ఇది సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధారణమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్లపాటు కేసు నడుస్తూనే ఉంటుంది. అధికారం, రాజకీయ బలం, డబ్బు వల్ల వారిని శిక్షించడం కష్టతరంగా మారిందని చిన్మయి తెలిపారు. అనంతరం ఆమె తనకు ఎదురైన పరిస్థితులు గుర్తు చేసుకున్నారు. తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడని.. అతడి గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు తనకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడని చెప్పారు. కోలీవుడ్‌లో వచ్చిన ఎన్నో చిత్రాల్లో మనసుని హత్తుకునే పాటలు పాడి గాయనిగానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ మంచి పేరు తెచ్చుకున్నారు చిన్మయి. విదేశాల్లో ప్రోగ్రామ్ కోసం వెళ్లినప్పుడు గీత రచయిత వైరాముత్తు తనని వేధింపులకు గురి చేశాడని, ఆయన మంచివాడు కాదని మీటూ వేదికగా ఆమె షాకింగ్ కామెంట్స్ చేశారు. అతడు చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్‌పైనే దెబ్బ కొట్టాడని ఆమె గతంలో ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆ పరిశ్రమ చిన్మయిని బ్యాన్ చేసింది. దాదాపు ఐదేళ్ల బ్యాన్ తర్వాత ఆమె ఇటీవల 'లియో'లో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు. దీనిపై ఆనందం వ్యక్తంచేశారు. మూవీ మేకర్స్‌కు ధన్యవాదాలు చెబుతూ పోస్ట్ పెట్టారు.



# డిఫరెంట్ రోల్స్ కావాలి

## సాయి పల్లవి

మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరోయిన్ సాయి పల్లవి, ఇప్పుడు మల్టీ టాలెంటెడ్ అని ప్రూవ్ చేసుకునేందుకు రెడీ అవుతున్నారు. ప్రజెంట్ హీరోయిన్‌గా సౌత్, నార్త్ ఇండస్ట్రీలను కవర్ చేస్తున్న ఈ బ్యూటీ త్వరలో తనలోని మరో షేడ్ చూపించాలనుకుంటున్నారు. అందుకోసం ఆల్రెడీ మేకర్స్‌ను రిక్వెస్ట్ చేస్తున్నారు. మాలీవుడ్ మూవీతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి.. తరువాత తమిళ, తెలుగు ఇండస్ట్రీల్లో కూడా మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. కమర్షియల్ లు చేసినా.. నటిగా తనకు గుర్తింపు తీసుకువచ్చే పాత్రలు మాత్రమే సెలెక్ట్ చేసుకుంటూ.. నేచురల్ బ్యూటీ అన్న ట్యాగ్ సొంతం చేసుకున్నారు. ఆ మధ్య లకు కాస్త బ్రేక్ ఇచ్చిన మలబార్ బ్యూటీ, మళ్లీ బిజీ అవుతున్నారు. ప్రస్తుతం తెలుగులో పాన్ ఇండియా మూవీ తండేల్‌లో నాగచైతన్యకు జోడిగా నటిస్తున్నారు. ఆమిర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ మూవీతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇస్తున్నారు. మోస్ట్ అవెయిటెడ్ రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ లు, కమర్షియల్ ల్లోనూ పర్ఫెమెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రల్లోనే నటించారు సాయి పల్లవి. అందుకే అప్ కమింగ్ ల విషయంలో కాస్త కొత్తగా ట్రై చేయాలనుందంటున్నారు. అవకాశం వస్తే ఫుల్‌లెంగ్త్ కామెడీ, యాక్షన్ రోల్స్ చేయాలన్నది సాయి పల్లవి కోరికట. అంతేకాదు నటిగా ఇంత బిజీగా కొనసాగుతూనే కెప్టెన్సీ బాధ్యతలు కూడా తీసుకునే ఆలోచనలో ఉన్నారు ఈ బ్యూటీ. తనకు డైరెక్షన్ చేయాలనుందన్న సాయి పల్లవి, అందుకు కథ కూడా సిద్ధం చేసుకుంటున్నానని చెప్పారు.

# హైడ్రా అంటేనే హడలిపోతున్న ఆక్రమణదారులు

**ఆక్రమణదారులు ఎవరైనా చర్యలు తప్పవన్న సంకేతాలు**
**ప్రభుత్వంపై ప్రజల్లో భారీగా సానుకూల స్పందన**
**గండిపేటలో అనుకూలంగా యువత ప్రదర్శనలు**
**కొత్తగా ఇప్పుడు ఓవైసీ వంతు రావడంతో సవాళ్లు**



**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రా.. ఇప్పుడు ఈ పేరు వింటే చాలామంది హడలిపోతున్నారు. హైదరాబాద్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో దీనిపైనే చర్చ జరుగుతోంది. ఆక్రమణల తొలగింపు పర్వాన్ని హైడ్రా గత కొన్ని వారాల ముందు నుంచే చేపట్టగా.. హీరో నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను కూడా హైడ్రా కూల్చివేయడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే ఉంది. రాజకీయ పార్టీలు కూడా విభిన్న రీతిలో దీనిపై స్పందిస్తున్నాయి. కాగా హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు తమ కట్టడాలు కూల్చేస్తాయో అని హైదరాబాద్‌లోని చాలా మంది టెన్షన్ పడుతున్నారు. హైడ్రాతో ప్రభుత్వం పొలిటికల్ గేమ్ ఆడుతోందని విపక్షాలు విమర్శిస్తుంటే.. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా.. తగ్గేదేలే అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తేల్చేశారు. అటు ఆక్రమణల తొలగింపునకు హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు కొన్ని వర్గాల నుంచి మద్ధతు లభిస్తోంది. కెసిఆర్ హయాంలోనే ఎన్ కన్వెషన్ కూలుస్తారని అనుకున్నారు. కానీ ఏదో మతలబు జరగడంతో ఆగిపోయింది. నాగార్జున కూడా ఇక తనకు ఢోకా లేదని,కెసిఆర్‌తో అంటకాగారు. ఈ క్రమంలో ఇప్పుడు హైడ్రా నిర్ణయాలపై రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు లభిసతోంది. ఎవరు ఆక్రమణ దారులైనా చర్యలు తీసుకోండని ప్రజల్లో సానూకూలత వస్తంది. రేవంత్ సర్కార్ నిర్ణయాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు మద్దతుగా గండిపేట వెల్ఫేర్ సొసైటీ సపోర్ట్ వాక్ నిర్వహించింది. ఈ సపోర్ట్ వాక్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రజలు మద్దతు తెలిపారు. ఈ వాక్‌లో భారీగా స్థానికులు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. చెరువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మనది హైడ్రా మనందరిదీ అనే నినాదాలు చేశారు. హైదరాబాద్ లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేస్తుండటంతో.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ కట్టడాలను కూడా కూల్చివేస్తారా ? అని భయపడు తున్నారు. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ తోపాటు పలువురి అక్రమకట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దీంతో సోషల్ మీడియాలో హైడ్రా కూల్చివేతలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. చెరువులను కబ్జా పెట్టి నిర్మించారంటూ పలువురు.. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందులో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసికి చెందిన బిల్డింగ్‌లు కూడా ఉన్నాయి. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందని వార్తలు వస్తుండటంతో ఆయన స్పందించారు. 'పేదలకు ఉచిత విద్యనందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించా. కొందరు వీటిపై వక్రదృష్టి పెట్టారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బు÷-లలెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడ కండి' అని అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఇక, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు తమ కాలేజీలను చెరువులను కబ్జాచేసి కట్టారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో వాటిని కూడా హైడ్రా కూల్చివేసేందుకు సిద్ధమైతున్నట్లు సమాచారం. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. అధర్మం ఓడాలంటే యుద్ధం త ప్పదన్న కృష్ణుడి మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడి బోధనానుసారం చెరువులను కాపాడుతున్నామని ఆయన తెలిపారు. మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ వెల్లడించారు. నిజాం ఆనాడే హైదరాబాద్‌ను లేక్ సిటీగా గుర్తించి గొలుసుకట్టు చెరువుల నిర్మాణాలు చేపట్టారని సిఎం రేవంత్ తెలిపారు. కరువు వచ్చిన సమయంలో గండిపేట, ఉస్మా న్ సాగర్ హైదరాబాద్ దాహార్తిని తీర్చుతున్నాయని, కానీ, కొందరు ధనవంతులు చెరువుల పక్కనే ఫాంహౌస్‌లు కట్టుకొని, ఆ నాలాలు గండిపేటలో కలిపారని, ఇప్పుడు వాటిని తాగునీటిగా ఉపయోగించేందుకు ఇబ్బందిగా మారిందని సిఎం రేవంత్ తెలిపారు. అలాంటి అక్రమ నిర్మాణాలను వదిలేస్తే ప్రజా ప్రతినిధిగా తాను విఫలమైనట్లేనని, అందుకే ఎవరు ఎంత ఒత్తిడి చేసినా మిత్రులకు ఫాంహౌజ్ లు ఉన్నా హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేసి, చెరువులను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ అన్నారు. ప్రకృతి విధ్వంసం చేస్తే ప్రకృతి విలయం ఎలా ఉంటుందో చూస్తున్నామని, ఇప్పటికే చెన్నై ఉత్తరాఖండ్, వయనాడ్‌లలో ఏం జరిగిందో చూశామని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ ను రక్షించుకోవాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందులో భాగంగానే చెరువులను రక్షణను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం హెచ్చరించారు. ఇకపోతే హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు. ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మే-రకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించు కోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం.

వచ్చిన ఫిర్యాదులను పరిగ ణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసి నట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొంద రు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్‌ఓసి లు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం. చింతల్ చెరువులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకు న్నట్టు ఆ నివేదికలో పొందుపరిచారు.



# హైడ్రా కూల్చివేతలతో ఉలిక్కిపాటు

**బీఆర్ఎస్‌కు నిద్దర పట్టడం లేదా?**
**సీఎం రేవంత్ లక్ష్యంగా ఎదురుదాడి రాజకీయాలు**
**ప్రజలు ఈసడించుకుంటున్నా..అవే విమర్శలు**

**హైదరాబాద్, ప్రజానావ :**

పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన బీఆర్ఎస్‌కు నిద్రపట్టడం లేదు. ప్రధానంగా కెసిఆర్ కుటుంబానికి, వారిని నమ్ముకున్న ఒకరిద్దరు రాజకీయ నేతలకు అస్సలు నిద్రపట్టడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత.. సీఎం రేంవత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, కార్యక్రమాలు, అమలు చేస్తున్న తీరు, చేపడుతున్న చర్యలతో బీఆర్ఎస్ నేతలకు నరంమీద పుండు సల్పినట్లుగా ఉంది. తట్టుకోలేక పోతున్నారు. రుణమాఫీని తట్టుకోవడం లేదు. హైడ్రా కూల్చివేతలను అస్సలు తట్టుకోవడం లేదు. ఎలాగైనా రేవంత్‌ను టార్గెట్ చేయాలన్న లక్ష్యంతా విమర్శలకు దిగుతున్నారు. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలను పక్కన పెట్టి ఎదురుదాడి రాజకీయాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగితే ఇక తమకు మనుగడ ఉండదన్న భావనలో, భయంలో ఉన్నారు. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే సిఎంగా రేవంత్ రెడ్డి ఉండకూడదన్నదే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల పాలసీగా ఉంది. అందుకే ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి భయపడుతున్నారు. విమర్శల కు పదను పెడుతున్నారు. ఒకటి తమ అవినీతి, అక్రమాలు బయటపడకుండా చూసుకోవడంతో పాటు... రేవంత్‌పై బురదజల్లే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. హైడ్రా కూల్చివేతలను స్వాగతించాల్సిన నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్టీ మారడం కోసం పల్లా రాజేశ్వర రెడ్డిని వేధిస్తున్నారని హరీష్ రావు చేసిన విమర్శలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. పల్లా రాజేశ్వర రెడ్డి కాలేజీ అక్రమంగా ఎందుకు కట్టాడో నిలదీయకుండా సిఎం రేవంత్‌రెడ్డిని నిలదీయడం వారి దౌర్భాగాన్ని సూచిస్తోంది. గత పదేళ్లుగా అక్రమాలను ప్రోత్సహించిన ఆనాటి మంత్రులు ఇప్పుడు కూడా అదే సాగాలని చూస్తున్నారు. అందుకే రేవంత్ సిఎంగా ఉన్నంత కాలం తెలంగాణలో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమనే భావనలో ఉన్నారు. అందుకే ప్రజా సమస్యలను పక్కన పెట్టిమరీ భారాస నేతలు కేవలం రేవంత్ రెడ్డినే టార్గెట్ చేసుకున్నారు. భారాస శ్రేణులను ప్రేరేపించడానికి, కాంగ్రెస్ శ్రేణులను రెచ్చగొట్టడానికి కెటీఆర్, హరీష్ వంటి వారు వ్యూహ రచన చేస్తున్నారు. రుణమాఫీ పేరుతో ఆందోళనలకు దిగడం, పల్లా రాజేశ్వర రెడ్డిని పక్కన పెట్టుకుని విమర్శలు చేయడం వంటివన్నీ ఇందులో భాగంగానే చూడాలి. ఉద్యమ సమయంలో మాదిరిగా సమయం చూసుకొని కాంగ్రెస్‌లో అవంతర్గత చిచ్చు రాజేయాలని పన్నాగం పన్నుతున్నారని అనిపిస్తోంది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపై, సంక్షేమం పట్ల ప్రభుత్వం పై పోరాడాల్సిన నైతిక బాధ్యతను భారాస విస్మరించి తమ తప్పులను కప్పిపుచుకునేలా, రేవంత్‌ను తిట్టిపోయడమే లక్ష్యంగా రాజకీయాలు నడుపుతుందనే వాదనలు వస్తున్నాయి. ÷ూష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి నేతలు రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రతిపక్ష హోదాను తుంగలో తొక్కి, కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్ష సాధింపు ధోరణిగా వ్యవహరించడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్య పరుస్తోంది. ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి పోరాడాల్సిన భారాస నేతలు కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాత్రమే టార్గెట్‌గా చేసుకోవడం రాజకీయ ఎత్తుగడలో భాగంగానే చూడాలి. గతంలో మీరే ముఖ్యమంత్రి కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉచిత సలహాలు ఇవ్వడం, ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమం పై కొర్రీలు పెట్టే ప్రకటనలు చేయడం, రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం పనితీరుపై పనిగట్టుకొని ఊహాజనిత ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని సైతం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు.కెటీఆర్, హరీష్‌రావు లు అదేపనిగా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, విమర్శలు చేయడం, మీడియా సమావేశాలు, ట్విట్టర్లు వంటివి ఉపయోగించడం ఈ మధ్య అధికమైంది. మొన్న ఆర్టీసీ బస్సుల్లో ఆడపడుచులపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యాలు కూడా ఆయనలోని అసహనాన్ని బహిర్గతం చేశాయి. అయితే వ్యతిరేకత తీవ్రంగా ఆరవడవం, మహిళా కమిషన్ నోటీసులతో ఒక్కసారిగా నాలుక కరుచుకున్నారు.రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అంటూ గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రికి విసిరిన సవాల్ చేసి భంగపడ్డాడు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దశల్లో రుణమాఫీ చేసిన సంగతి తెలిసి కూడా దానిపై పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారానికి భారాస తెరలేపే ప్రయత్నం చేసింది. రైతుల పేరుతో ఆందోళనలకు దిగింది. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలంటూ ఏకంగా ప్లెక్సీలు ఏర్పాటు చేయడం భారాస అసమనానికి పరాకాష్టగా కనిపిస్తోంది. మొన్న రేవంత్ రెడ్డి అధికారిక అమెరికా పర్యటనను కూడా కెటీఆర్ రాజకీయం చేయాలని ప్రయత్నించడం రేవంత్ పై వ్యక్తి గత కక్షకు అద్దం పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మానసికంగా స్థిరంగా లేరని కేటీఆర్ చేసిన ఘాటైన మాటలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుంది. భారాస నేతలు చెచ్చిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఫలితమే సిద్ధిపేటలో హరీష్ రావు కార్యాలయంపై దాడిగా చూడాలి. భారాస నేతలు ఈ స్థాయిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కార్యక్రమాలు చేస్తున్నారో అందుకు ధీటుగా కాంగ్రెస్ శ్రేణులు ప్రతిఘటించే చర్యలకు దిగడం నిజంగా ఆందోళన కలిగించే అంశం. ప్రతిపక్షం నుంచి ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఏమో గానీ శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఏతావాతా రాజకీయాల్లో ఇప్పుడు సిఎంగా రేవంత్ ఉండడాన్ని బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. తమ ఉనికికి ముప్పుగా తయారైన రేవంత్‌ను తప్పించే వరకు ఎత్తులు వేస్తూనే ఉంటారు. యాగీ చేస్తూనే ఉంటారు.

# రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత



**హైదరాబాద్, ప్రజానావ:** నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రం గా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయ దుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎస్‌సీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదా నికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసు లు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చి వేతల పర్వం సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణెళి లక్ష్యంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే ఈ లోపే అధికారులు దాన్ని నెలమట్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీపై కూడా ఆరోపణలు వచ్చాయి. అక్రమంగా భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు అధికార పార్టీ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టడం లేదు. ఇలా చిన్నా, పెద్ద తేడా లేకుండా హైడ్రా ఆక్రమణదారుల బెండు తీస్తోంది.

# రోహిత్‌పై వీడని సస్పెన్స్..




ఐపీఎల్ 2025 సీజన్ కు ముందు మెగా వేలం కోసం ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. డిసెంబర్ చివర్లో ఆటగాళ్ళ వేలం జరగనుండగా వచ్చే వారంలో బీసీసీఐ రిటెన్షన్ కు సంబంధించి నిబంధనలు ఖరారు చేసే అవకాశముంది. అయితే ఇప్పటికే పలు ఫ్రాంచైజీలు తమ రిటైన్షన్ జాబితాపై తర్జనభర్జన పడుతున్నాయి. దీనిలో భాగంగా ముంబై ఇండియన్స్ రిటైన్ చేసుకునే ప్లేయర్స్ పైనే అందరి దృష్టి ఉంది. తమ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను ముంబై రిటైన్ చేసుకుంటుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. హార్థిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగించిన తర్వాత హిట్ మ్యాన్ ముంబై జట్టులో అంత సౌకర్యంగా లేదని వార్తలు వస్తున్నాయి. రోహిత్ ను రిటైన్ చేసుకోవడంపై ముంబై కూడా ఇంకా నిర్ణయానికి రాలేదని సమాచారం. కాగా ముంబై రిటైన్ చేసుకునే ఆటగాళ్ళ జాబితాను చూస్తే కెప్టెన్ హార్థిక్ పాండ్యాను కొనసాగించడం ఖాయమని చెప్పొచ్చు. గత సీజన్ లో జట్టును సమర్థవంతంగా నడిపించలేకపోయినప్పటికీ పాండ్యాపై ముంబైకి నమ్మకం తగ్గలేదని తెలుస్తోంది. అలాగే స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ ను కూడా రిటైన్ చేసుకునే అవకాశముంది. సూర్యకుమార్ కు జట్టు పగ్గాలు అప్పగిస్తారన్న వార్తలు వస్తుండగా.. కోల్ కతా ఫ్రాంచైజీ ట్రేడింగ్ కోసం అతన్ని సంప్రదించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ముంబై అతన్ని వదులుకునే అవకాశాలు లేనట్టే. ఇక హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మను కూడా ముంబై రిటైన్ చేసుకోవడం ఖాయం. తిలక్ వర్మ గత సీజన్ లో 400కు పైగా పరుగులు చేసి ముంబై విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. ఇక స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను కూడా ముంబై వదులుకునే అవకాశాలు కనిపించడం లేదు.

# ద్రవిడ్ రికార్డు బద్దలు కొట్టిన జో రూట్!

ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన మూడో ఆటగాడిగా రూట్ రికార్డుల్లో నిలిచాడు. శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరిగిన మొదటి టెస్టు రెండో ఇన్నింగ్స్ రూట్ హాఫ్ సెంచరీ (62 నాటౌ ట్‌బీ 128 బంతుల్లో, 2 ఫోర్లు) చేసి.. ఈ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ రికార్డును బ్రేక్ చేశాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ (68) అగ్రస్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్ మాజీ క్రికెటర్ శివనారాయణ్ చంద్రపాల్ (66) రెండో స్థానంలో ఉండగా.. రూట్ (64) మూడో స్థానంలో ఉన్నాడు. అలెన్ బోర్డర్ (63), రాహుల్ ద్రవిడ్ (63), రికీ పాంటింగ్ (62) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మాంచెస్టర్‌లో టెస్ట్ ఫార్మాట్‌లో అత్యధిక అర్ధ శతకాలు (8) చేసిన ప్లేయర్‌గా కూడా రూట్ మరో రికార్డు నెలకొల్పాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక 50ం స్కోరు చేసిన ఇంగ్లండ్ ఆటగాళ్ల జాబితాలో రూట్ (10) నాలుగో స్థానంలో నిలిచాడు.






# చెత్తగా ఓడినా డ్రెస్సింగ్ రూమ్‌లో నవ్వుకుంటున్నారు..

## పాక్ క్రికెటర్లపై మాజీలు ఫైర్!

బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్తాన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. అతి విశ్వాసంతో తొలి ఇన్నింగ్స్‌ను 448/6 వద్ద డిక్లేర్ చేసిన పాక్.. అందుకు భారీ మూల్యమే చెల్లించుకుంది. పాక్ ఓటమిపై ఆ దేశ మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. మాజీ క్రికెటర్ కమ్రన్ అక్మల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ఆటగాళ్ల కంటే క్లబ్ క్రికెటర్లే మెరుగ్గా ఆడతారని ఎద్దేవా చేశారు. చెత్తగా ఓడి కూడా డ్రెస్సింగ్ రూమ్‌లో నవ్వుతూ ఎలా ఉండగలిగారో తనకు అర్థం కావడం లేదన్నారు. పాక్ క్రికెట్ పూర్తిగా అపహాస్యమైందని అక్మల్ పేర్కొన్నారు. కమ్రన్ అక్మల్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ%ా% 'మహ్మద్ రిజ్వాన్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా హాఫ్ సెంచరీ చేశాడు. రిజ్వాన్ పరుగులు చేయకుంటే.. పాక్ ఇన్నింగ్స్ తేడాతో ఓటమిని మూటగట్టుకునేది. గత ఐదేళ్లుగా పాక్ టీమ్ ఏమీ నేర్చుకోలేదు. పసికూన జింబాబ్వేపై కూడా ఓడిపోయారు. గత ఆసియా కప్, వన్డే ప్రపంచకప్‌లో కూడా చెత్తగా ఆడారు. 2024 టీ20 ప్రపంచకప్‌లోనూ అదే పరిస్థితి. పాకిస్తాన్ క్రికెట్ పూర్తిగా అపహాస్యమైంది' అని మండిపడ్డారు.'బంగ్లాదేశ్‌లో అల్లర్లు జరుగుతున్నాయి. ఆ జట్టు ఆటగాళ్లు చాలా కఠిన పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కూడా బంగ్లా బ్యాటర్లు చూపిన తెగువ అద్భుతం. మంచి టెస్టు విజయం ఖాతాలో వేసుకున్నారు. పాక్ క్రికెట్ పతనాన్ని బాహ్య ప్రపంచానికి చెప్పారు. మా బ్యాటర్లు క్లబ్ క్రికెట్‌లో ఆడినట్లు ఆడారు. కాదు కాదు.. క్లబ్ క్రికెటర్లే మెరుగ్గా ఆడతారు. గెలుద్దామనే ఆలోచన మా జట్టులో లేకుండా పోయింది. చెత్తగా ఓడినా డ్రెస్సింగ్ రూమ్‌లో నవ్వుతూ ఎలా ఉన్నారో అర్థం కావడం లేదు. మమ్మల్ని ఎవరూ అడగరని వారికీ తెలుసు. విజయం సాధించిన బంగ్లాకు నా అభినందనలు' అని అక్మల్ చెప్పారు.

# వినేష్ ఫొగట్‌కు బంగారు పతకం



పారిస్ ఒలింపిక్స్ 2024లో అనర్హత వేటుకు గురైన భారత మహిళా రెజ్లర్ వినేష్ ఫొగట్‌కు ఎట్టకేలకు భారీ ఊరట లభించింది. ఆమెకు బంగారు పతకం లభించింది. ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని హర్యానాలోని సర్వ్ ఖాప్ పంచాయత్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేసింది. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కేజీల రెజ్లింగ్ విభాగంలో వినేష్ ఫొగట్ ఫైనల్స్ వరకు దూసుకెళ్లిన విషయం తెలిసిందే. తుదిపోరులో అమెరికాకు చెందిన రెజ్లర్ సారా హిండెబ్రాండ్‌ను ఢీ కొట్టాల్సి ఉండగా.. బౌట్ ఆరంభానికి కొన్ని గంటల ముందు డిస్ క్వాలిఫై అయ్యారు. 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫొగట్ అనర్హత వేటుకు గురయ్యారు. ఫలితంగా ఒక్క పతకం కూడా దక్కించుకోలేకపోయారు. నిజానికి ఫైనల్స్‌లో ఓడిపోయినా కూడా రజత పతకం ఖాయం అయ్యేదే. శరీర అదిక బరువు కారణంగా ఒలింపిక్స్ గేమ్స్ నుంచే వైదొలగాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారామె. ఇప్పుడు ఖాళీ చేతులతో స్వదేశానికి రావాల్సి వచ్చింది. తనపై పడిన అనర్హత వేటుపై వినేష్ ఫొగట్ న్యాయపోరాటం చేశారు. ఆమె తరఫున భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అడ్‌హక్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ విధి విధానాలు, నిబంధనలను పరిశీలించిన కోర్టు అనర్హత నిర్ణయాన్ని సమర్థించింది. దీనితో కోర్టులో కూడా ఆమెకు ఊరట లభించలేదు. ఈ పరిస్థితుల్లో భారత్‌కు తిరిగి వచ్చిన వినేష్ ఫొగట్‌కు హర్యానా ఖాప్ పంచాయత్ బంగారు పతకంతో గౌరవించింది. 30వ పుట్టినరోజు నాడు ఆమెకు ఈ మెడల్‌ను అందజేసింది. ఖాప్ పంచాయత్ తన సొంత నిధులతో దీన్ని తయారు చేయించింది. ఈ పతకంపై ఒలింపిక్స్ సింబల్, 2024 అనే అక్షరాలను ముద్రించింది. దీనిపై వినేష్ ఫొగట్ స్పందించారు. తన సొంత ఊరిలో, సొంత మనుషుల మధ్య పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం ఆనందాన్ని ఇస్తోందని అన్నారు. అంతకుమించి హర్యానా ఖాప్ పంచాయత్ తనకు బంగారు పతకాన్ని బహూకరించడం చిరస్మరణీయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.

# వరుస విజయాలతో ఫైనల్ రేసులోకి ఇంగ్లాండ్

వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేస్ రసవత్తరంగా సాగితోంది. వరుస విజయాలతో భారత్ దాదాపుగా ఫైనల్ బెర్తు ఖాయం చేసుకోగా మరో ప్లేస్ కోసం హోరాహోరీ పోటీ నెలకొంది. తాజాగా వరుస విజయాలతో ఇంగ్లాండ్ ఫైనల్ రేసులోకి తిరిగొచ్చింది. నెల రోజుల క్రితం ఏడో స్థానంలో నిలిచిన ఇంగ్లిష్ జట్టు ఇపుడు టాప్-4లోకి దూసుకొచ్చింది. స్వదేశంలో ఇటీవల వెస్టిండీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్.. శ్రీలంకపై తొలి టెస్టులో అయిదు వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో ఆసీస్ , కివీస్ జట్లకు టెన్షన్ మొదలయింది.న్యూజిలాండ్.. భారత్‌తో మూడు, శ్రీలంకతో రెండు టెస్టులు ఆడనుంది. శ్రీలంక సిరీస్‌ను కైవసం చేసుకుని, టీమిండియాను ప్రతిఘటిస్తే కివీస్ తన పర్సంటేజ్‌ను మెరుగుపర్చుకుంటుంది. ఇక భారత్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో ఆసీస్ చిత్తుగా ఓడితే రెండో స్థానాన్ని కోల్పోవాల్సి వస్తుంది. మరోవైపు ఇంగ్లండ్.. శ్రీలంకతో సిరీస్ ముగిసిన అనంతరం పాకిస్థాన్‌తో మూడు టెస్టులు ఆడాల్సి ఉంది. లంక, పాక్‌లపై ఓటమెరుగకుండా సత్తాచాటితే ఇంగ్లండ్ రెండో స్థానానికి చేరే అవకాశం ఉంది. 2023 నుంచి 2025 వరకు జరుగనున్న టెస్టు మ్యాచ్‌ల విజయాల శాతం ప్రకారం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు రెండు జట్లు అర్హత సాధిస్తాయి.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657